శభాష్ వలంటీర్

కరోనా వైరస్ భయపెడుతున్నా... తుఫాను వచ్చినా... ప్రతిపక్షాలు వెక్కిరిస్తున్నా... వలంటీర్లు వెన్నుచూపలేదు. ఎక్కడా వెనక్కి తగ్గలేదు. కరోనా కష్టకాలంలో అందరూ ఉన్నా ఒంటరిగా బిక్కుబిక్కు మంటూ బతుకుతున్నవారి వద్దకు వెళ్లి భరోసా కల్పించారు. లక్షలాది మంది ప్రాణాలను కాపాడారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారకముందే అవ్వాతాతల ఇంటి తలుపుతట్టి పింఛను అందిస్తున్నారు. అర్హత గల తల్లికి అమ్మఒడి..అక్కచెల్లెమ్మలకు ఆసరా, చేయూత... నిరుపేదలకు నివేశన స్థలం.. పక్కా ఇళ్లు... విద్యార్థులకు విద్యాదీవెన... ఇలా ఒకటేమిటీ సమస్త సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే చేరుస్తూ శభాష్ వలంటీర్ అని అందరి మన్ననలు పొందుతున్నారు. వలంటీర్ల వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపారు.

– కంచరపాలెం

ఒకటో తేదీనే పింఛన్ అందుకుంటున్నా..

వలంటీర్ల సేవలకు విలువ కట్టలేం. కంచరపాలెం రాంజీ ఎస్టేట్ 270 సచివాలయం పరిధిలో పనిచేస్తున్న మా వలంటీర్ రాజేష్ ప్రతి నెలా ఒకటో తేదీనే మా ఇంటికి వచ్చి పింఛను సొమ్ము అందిస్తున్నాడు. మా యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నాడు. మా కుటుంబ సభ్యులు మాదిరిగా మా కష్టాలను అడిగి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాడు. ఈ వ్యవస్థ ఎంతో బాగుంది. పెన్షన్ ఎప్పుడిస్తారో ఎవరి దగ్గరికి వెళ్లాలో తెలియని పరిస్థితి నుంచి ఒకటో తేదీనే ఇంటికే పింఛన్ వచ్చే పరిస్థితి కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నా..

– పి.సాయిబాబా



అసిస్టెంట్ ప్రొఫెసర్ ..ఈ వలంటీర్

బోని యామిని యశోద.. విద్యావంతురాలు..ఓ ఇంజినీరింగ్ కళాశాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అంతేకాకుండా కంచరపాలెం 265 సచివాలయం గొల్లకంచరపాలెంలో వలంటీర్‌గా సేవలు అందిస్తున్నారు. తనకు అప్పగించిన 50 ఇళ్లను రోజూ సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్నారు. సంక్షేమ పథకాలను వివరించి అర్హులకు అందేలా చేస్తున్నారు. ఇక ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 5 గంటలకే తన పరిధిలో ఇంటింటికీ పెన్షన్ అందజేస్తున్నారు. తన తండ్రి బోని రవికుమార్ ప్రోత్సాహంతో వలంటీర్‌గా వచ్చే గౌరవ భృతిని పలు సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ మన్ననలు పొందుతున్నారు.


పెన్షన్ సొమ్మును అందజేస్తున్న వలంటీర్ బోని యామిని యశోద (ఫైల్)

సేవా దృక్పథంతోనే..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ చాలా గొప్పది. అందుకే సేవకురాలిగా చేరా. పీహెచ్‌డీ పూర్తి చేసి ఓ ప్రైవేటు కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ జగనన్న సైన్యంలో వలంటీర్‌గా చేరా.

– బోని యామిని యశోద, వలంటీర్, గొల్లకంచరపాలెం,

బాలికకు ఆర్థిక సాయం


బాలికకు ఆర్థిక సాయం అందిస్తున్న కీర్తి పట్నాయక్, దాతలు

మురళీనగర్: పేదింటి విద్యార్థినికి మురళీనగర్‌లోని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ సాయపడింది. కొత్తపాలేనికి చెందిన కె.హిమబిందు పదోతరగతి పాసయ్యింది. ఇంటర్‌లో చేరడానికి సర్టిఫికెట్లు కోసం పాఠశాలకు రూ.18 వేలు చెల్లించాల్సిరావడంతో ఆందోళన చెందింది. ఫీజు చెల్లించలేని పరిస్థితుల్లో కుప్పిలి పుష్ప..చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కుప్పిలి కీర్తిపట్నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె దాతల సాయాన్ని కోరారు. అనంతప్రసాద్, పీబీటీ పట్నాయక్, బి.రామానందం, పి.సతీష్ కుమార్, డాక్టర్ బి.శ్రీనివాస్‌లు రూ.10 వేలను కీర్తిపట్నాయక్ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో 89వార్డు శిష్టకరణాల సంఘం అధ్యక్షుడు బి.రామనాథం, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరావు, కార్యదర్శి పి.శేఖర్, సంయుక్త కార్యదర్శి జి.ప్రశాంత్, కె.నరసింహమూర్తి, డి.అనంతప్రసాద్, కోశాధికారి కె.శర్మ, కె.పుష్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్జీలు స్వీకరించిన కేకే రాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డులోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలోని మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని పలువురు కేకేరాజుకు వినతి పత్రాలు అందజేశారు. అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. సత్వరం సమస్యలు పరిష్కరిస్తామని కేకే రాజు హామీ ఇచ్చారు.

ఎమినిటీస్ కార్యదర్శులతో సమీక్ష


మాట్లాడుతున్న 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: సచివాలయాల పరిధిలో పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేయాలని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు వార్డు కార్యాలయంలో మంగళవారం ఎమినిటీస్ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి సచివాలయాల పరిధిలో వారు పబ్లిక్ పనులు, విద్యుత్ దీపాలు, వంటివి ప్రజలు ఇబ్బందులు పడకుండా పూర్తిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈ సతీష్, వర్క్ఇన్‌స్పెక్టర్ శ్యామ్, రఘు, రాజు, సంతోష్, ఎమినిటీస్ కార్యదర్శి అలేఖ్య, విజయలక్ష్మి, మహాలక్ష్మి, తరుణ్, వేణు గౌతమ్, సతీష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మద్రిపాలెం: యువతి అదృశ్యమైన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. డి.మధుచందన (20) అనే యువతి కంచరపాలెం ధర్మానగర్‌లో తల్లిండ్రులతో కలిసి నివశిస్తోంది. సదరు యువతి 80 ఫీట్ రోడ్డు సమీపంలో ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. రోజూ మాదిరి సోమవారం ఆఫీసుకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం సాయంత్రం తల్లి డి.రాజేశ్వరి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెచ్‌సి సతీష్ దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనుల పరిశీలన


కళింగనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. వార్డులోని కళింగనగర్ వుడా క్వార్టర్స్‌లో డ్రైన్లు, సీసీ రోడ్లు అంబేడ్కర్ కాలనీలో రక్షణ గోడ, గ్రీన్‌బెల్ట్ ఏరియాలో కళావేదిక, చిట్టిబాబు కాలనీలో గెడ్డ రక్షణ గోడ పనులను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అయన ఎమినిటీస్ సెక్రటరీలు సాయినాథ్, రోషిణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, రాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో మంగళవారం సుబ్ర హ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది శివ, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి

సీతమ్మధార : వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని డెల్టాస్ కళాశాల్లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలు వేగంగా నడపడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రామూర్తి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం జీవీఎంసీ కమిషనర్ సీ.ఎం.సాయికాంత్ వర్మను తన చాంబర్‌లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, బర్కత్ ఆలీ, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, కేవీఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయినాథునికి ప్రత్యేక పూజలు


కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యానమందిరం ప్రాంగణంలోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసకుమార్, జీవీకే ప్రియ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ కుటుంబానికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమార్ దంపతులను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు సత్కరించి, బాబా ఫొటోను బహుమతిగా అందజేసారు.

నేరాల నియంత్రణకు మహిళా పోలీసులు సహకరించాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సాయి

మద్రిపాలెం : నేరాలను నియంత్రణకు సచివాలయ మహిళా పోలీసులు సహకరించాలని కంచరపాలెం సీఐ ఎన్.సాయి కోరారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. అనుమానితులు, అపరిచితులు ఎవరైనా సంచరిస్తున్నట్టు గమనించినట్టయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఒంటరిగా వెళ్తున్న మైనర్లను లక్ష్యంగా చేసుకుని నగదును,సెల్‌ఫోన్లు కాజేస్తున్నారని, అలాంటివారిపై నిఘా ఉంచాలని తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వారి ఫొటోలు సచివాలయ మహిళా పోలీసులకు అందజేస్తామని, తద్వారా వారి కదలికలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు సమీర్, రవికిషోర్, దివ్యభారతి పాల్గొన్నారు.

23న ఆర్పీ పట్నాయక్‌తో ముఖాముఖి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పటా్నయక్‌తో ఈనెల 23న విశాఖ పౌరగ్రంథాలయంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలు మంగళవారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి అంశంపై ప్రసంగం, ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, బి.చిన్నారావు, బాబ్జి, అర్చన, గాయత్రి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

ఆచార్య పార్థసారథికి ఘన నివాళి


పార్థసారథి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు జి.పార్థసారథి వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు విభాగంలోని పార్థసారథి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ వృత్తిపట్ల అంకితభావం, మేధస్సుతో కూడుకున్న పరిశోధన, ఆర్థిక నైపుణ్యం విశ్వవిద్యాలయానికి ఉపయుక్తంగా నిలిచాయన్నారు. ఆయన వద్ద విద్యార్థిగా తాను చదవుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆచార్య పార్థసారథిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.నాగరాజ, ఆచార్య డి.ఆశాలత, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, విద్యార్థులు, పరిశోధకులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లూయిడ్ డైనమిక్స్‌పై సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో కాంపుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ అంశంపై జరిగే రెండు వారాల వర్క్‌షాప్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. విద్యార్థులకు వాస్తవిక జ్ఞానాన్ని అందించేలా సదస్సు నిర్వహించడంపై ఆయన అభినందించారు. విభాగాధిపతి ఆచార్య వి.వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు కాంపుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్(సీఎఫ్‌డీ)పై విస్తృత అవగాహన, నూతన జ్ఞానాన్ని అందించేలా సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ రంగంలో నూతన ఆవిష్కరణలు వివరిస్తామన్నారు. ఈ సదస్సులో మెరైన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ డి.ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంపోజిట్ మెటీరియల్స్ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్, ఎం.వెంకటేష్, అభిషేక్ నల్లూరిలు సంయుక్తంగా రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ బయో బేస్డ్ నానో పాలిమర్స్ కాంపోజిట్ మెటీరియల్స్' పుస్తకాన్ని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని లాంబర్ట్ పబ్లిషర్స్ సంస్థ ముద్రించింది. పరిశోధనాత్మక ఫలితాల ఆధారంగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. పుస్తక రచయితలను ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ అభినందించారు.

వేధింపులపై విచారణకు డిమాండ్



మెయిన్‌గేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగాధిపతి ఆచార్య ఎస్.సత్యనారాయణపై పరిశోధకురాలు చేసిన లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏయూ మెయిన్ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు వై.రాంబాబు, అచ్యుతరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ గతంలో కూడా సదరు ఆచార్యునిపై ఆరోపణలు ఉన్నాయని, కఠిన చర్యలు తీసుకోని కారణంగా ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారించాలన్నారు.

అంజుయాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

మద్రిపాలెం: చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి సీఐ అంజూయాదవ్‌పై జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల బీసీ జోనల్ ఇంచార్జ్ డాక్టర్ తుల్లి చంద్రశేఖర్ యాదవ్ ఓ ప్రకటనలో మండిపడ్డారు. అంజుయాదవ్ వ్యక్తిత్వం తెలియకుండా పవన్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మహిళలంటే పవన్‌కు గౌరవం లేదని, మొన్న వలంటీర్లపై అసభ్యకరంగా మాట్లాడాడని, నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజల ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

మద్రిపాలెం : కారుని తప్పించబోయి ఓ ఆటో ఢీకొనడంతో యువకుడికి గాయాలయ్యాయి. కంచరపాలెం పరిధిలో బర్మాక్యాంప్, నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న జి.యువకిషోర్ నగరంలో ఓ బంగారం షాపులో పనిచేస్తున్నాడు. మంగళవారం షాప్‌కు వెళ్లడానికి ఇంటి నుంచి ఉదయం 9.30 గంటలకు బైక్‌పై బయలుదేరగా ఊర్వశి జంక్షన్ సమీపంలో సర్వీసు రోడ్డులో ఓ కారుని తప్పించబోయి ఆటోను ఢీకొట్టాడు. దీంతో అతని కుడి మోచేతికి ఫ్రాక్చర్ అయ్యింది. ఆ యువకుడిని సమీపంలో ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి దర్యాప్తు చేపట్టారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

డాబాగార్డెన్స్ : స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం 49, 50, 51 వార్డుల్లో కళా బృందాలచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో కళాకారుడు వైకే రాజు కళా బృందంచే ప్లాస్టిక్ నిషేధం, చెత్తపై చిత్తశుద్ధి, పరిసరాల పరిశుభ్రత, ఎకో-వైజాగ్ తదితర అంశాలపై వీధి నాటకం, జానపద గీతాలతో కళా ప్రదర్శనలిచ్చారు.

అభివృద్ధి పనులపై కేకే రాజు సమీక్ష


మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార : జీవీఎంసీ 55వ వార్డు అభివృద్ధికి సంబంధించి బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డులో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సూచించారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, 55 వార్డు కార్పొరేటర్ కేవీఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, జోన్-5 ఏసీపీ రఘునందరావు, డీఈ భరణి, పీడీ పద్మావతి, సచివాలయ సిబ్బంది, డైరెక్టర్ వెంకటలక్ష్మి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో లీగల్ మెట్రాలజీ బృందం తనిఖీలు


ఎంవీపీ రైతు బజార్ స్టాల్ వద్ద కాటా పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ బృందం సభ్యులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో మంగళవారం లీగల్ మెట్రాలజీ(తూనికలు, కొలతల విభాగం) బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ బి.మనోహర్ ఆధ్వర్యంలో అధికారులు స్టాళ్లలో కాటాలు పరిశీలించారు. స్టాళ్ల నిర్వాహకులు సరిగా తూకం వేసి వినియోగదారులకు కూరగాయలు అందిస్తున్నారా? లేదా? అనే దానిపై ఆరా తీశారు. సబ్సిడీపై టమాటాలు విక్రయిస్తున్న కౌంటర్లను కూడా పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి అందరికీ సబ్సిడీపై టమాటాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. తూకంలో మోసాలు జరగకుండా చూడాలని రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌కు సూచించారు. అనంతరం అక్కడ నుంచి పెదవాల్తేరు ప్రాంతంలో చికెన్, మటన్ షాపుల వద్దకు వెళ్లారు. అక్కడ తూకం సరిగా వేయని వర్తకులను గుర్తించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్ల సభ్యులు పి.డి.వి.అప్పలరాజు, వి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కథల పోటీలు ప్రారంభం

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు నిర్వహిస్తున్న కథ చెబుతారా.. ఊ కొడతాం పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు పురాణ, ఇతిహాసాలతో పాటు చారిత్రక అంశాలలో కథలు చెప్పాల్సి ఉంటుంది. మంగళవారం చంద్రపాలెం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పోటీల్లో జి.కేశవ సుబ్రహ్మణ్యం, పి.తేజేశ్వరరావు, ఎస్.హారికలు విజేతలుగా నిలిచారు. ఈ నెల 21న విద్యాధరి పబ్లిక్ స్కూల్ గవరపాలెం, అనకాపల్లి, 24న గిరిజన వికాస కేంద్రం రంపచోడవరంలో పోటీలు జరగనున్నాయి.

యువతి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

ఆరిలోవ: చినగదిలిలో ఆత్మహత్య చేసుకున్న శెట్టి స్వప్న(22) మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం సరవి గ్రామానికి చెందిన శెట్టి స్వప్న చినగదిలిలో అద్దింట్లో ఉంటూ రామాటాకీస్ సమీపంలో ఓ బ్యూటీపార్లర్‌లో పని చేస్తుంది. సోమవారం ఆమె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అనంతరం ఏఎస్ఆర్ జిల్లాలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె ఒంటరిగా ఉండడం, ఎలాంటి కారణాలు తెలియకపోవడంతో సంఘటన జరిగిన రోజు పోలీసులకు ఎలాంటి వివరాలు లభించలేదు. తల్లిదండ్రులు మంగళవారం వచ్చిన అనంతరం వారి నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. దీనిపై మృతురాలు తల్లిదండ్రులు శెట్టి గుణం, స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్వప్న తమ కుటుంబానికి తెలిసిన గొర్లె చిన్నారావుకు రూ.85,000 అప్పు ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి అతను ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సోమవారం చిన్నారావు.. స్వప్నకు ఫోన్ చేసి డబ్బులు విషయంపై మాట్లాడాడు. దీనిపై వారి మధ్య మాటామాటా పెరిగి ఫోన్‌లో తగాదా జరిగింది. మధ్యలో చిన్నారావు ఫోన్ ఆపేశాడు. కొద్ది సేపటికి ఆమె ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.